క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడు, కొత్తపల్లి తండాలకు చెందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. భూనీడుకు చెందిన చిన్నయ్యకు రూ.65,000, కొత్తపల్లి తండాకు చెందిన మోతిలాల్‌కు రూ.67,500 చెక్కులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, సవారి శ్రీను, భాస్కర్‌నాయక్, భీమ్యానాయక్, పాండునాయక్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో తైబజార్ వేలం



మరికల్: మండల కేంద్రంలోని తైబజార్ వేలం రికార్డు స్థాయిల్లో రూ. 11.50 లక్షలు పలికింది. సోమవారం గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి వేలం నిర్వహించారు. వేలంలో 8 మంది పాల్గొన్నారు. పోటాపోటీగా సాగిన వేలంలో హరిజన్‌వాడకు చెందిన తిర్మలయ్య రూ.11,50 లక్షలకు దక్కించుకున్నారు. గతేడాది రూ.4,30 లక్షలకు పలికిన తైబజార్ ఈ ఏడాది రూ.7,20 లక్షలు అధికంగా పలకడం విశేషమని అధికారులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

కోస్గి: తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. పట్టణానికి చెందిన ఏ. వెంకటయ్య సోమవారం తాగి బైక్ నడుపుతూ పట్టుబడ్డాడు. కోస్గి కోర్టులో హాజరు పరచగా జడ్జి ఫర్వీన్ బేగం వెంకటయ్యకు 5 రోజుల జైలు శిక్షతోపాటు రూ.2వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వం పారితోషికం చెల్లించాలి

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం గత నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో విధుల నిర్వహించిన ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు పారితోషికం చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ స్వామి, ఉపాధ్యక్షుడు బాలాజి కలెక్టరేట్ ఏఓకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం (ఎస్ఎంఏఎం) పథకం కింద భూమి ఉన్న మహిళా రైతులకు 50 శాతం రాయితీతో 23 రకాల వ్యవసాయ పరి కరాలు అందజేయనున్నట్లు ఆయా మండలాల వ్యవసాయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

తీరని తాగునీటి కష్టాలు



అమరచింత: మున్సిపాలిటీ కేంద్రంలో నిత్యం ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మిషన్ భగీరథ ద్వారా 6 ఓవర్‌హెడ్ ట్యాంకులతో నిత్యం 12 లక్షల లీటర్ల తాగునీటిని అందిస్తున్నామని మిషన్ భగీరథ అధికారులు లెక్కలు చూపడంతోనే సరిపోతుందని, ఆచరణలో మాత్రం ప్రజలకు తాగునీటిని అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు పట్టణంలో తాగునీటి అవసరాల కోసం 16 సోర్స్ బోర్లు ఉన్నా.. వాటి ద్వారా వచ్చే నీటిని పైప్‌లైన్ల ద్వారా నిత్యం అందిస్తున్నా ప్రజలు మాత్రం కాలనీల్లో కుళాయిల ద్వారా తాగునీరు అందడం లేదని మున్సిపల్ సిబ్బందిని నిలదీస్తున్న పరిస్థితులు దాపరించాయి. వారం రోజుల నుంచి అరకొరగా కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని బీసీ కాలనీలోని 6, 7 వార్డుల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి కుళాయి ద్వారా, ట్యాంకర్‌తో నీటిని అందించినా పూర్తిస్థాయి అవసరాలు తీరడం లేదన్నారు. కాలనీల్లో ఉన్న చేతి పంపులకు సైతం మరమ్మతులు చేపట్టకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.


ఎప్పుడొస్తారో.. ఎప్పుడెళ్తారో

- సమయపాలన పాటించని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు



ఉదయం 11గంటలకు తహసీల్దార్ చాంబర్ ఇలా

కృష్ణా: మండల కేంద్రంలోని పలు కార్యాలయాల్లో అధికారులు సమయపాలన పాటించడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఫిర్యాదుల దినోత్సవం కావడంతో మండల ప్రజలు పలు సమస్యలపై కార్యాలయాలకు వచ్చినా అధికారులు లేకపోవడంతో వెనుదిరిగినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటల తర్వాతనే అధికారులు కార్యాలయాలకు వస్తుంటారని ఆరోపిస్తున్నారు. సోమవారం తహసీల్దార్ వెంకటేష్ ఉదయం 11 గంటల 10 నిమిషాలకు, సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి 10 గంటల 40 నిమిషాలకు వచ్చారు. కంప్యూటర్ ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్, డీటీ, రికార్డు అసిస్టెంట్లు ఇలా.. సిబ్బంది కూడా ఉదయం 11 గంటల తరువాతే రావడం అలవాటని గ్రామస్తులు ప్రజలు పేర్కొన్నారు. అదే విధంగా ఎంపీడీఓ కార్యాలయంలో కూడా ఇదే తీరు నడుస్తుందని వాపోతున్నారు. మండల కేంద్రం రాష్ట్ర సరిహద్దులో ఉండడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



11 గంటల 5 నిమిషాలకు ఎంపీడీఓ కార్యాలయం ఇలా



ఎంపీడీఓ కార్యాలయంలో ఖాళీ కుర్చీల దర్శనం

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సాయం



ఎస్‌ఐకు చెక్కు అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూ. 20వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు సోమవారం అప్పంపల్లిలో రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రాములుకు సంఘం నాయకులు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, కుల సంఘాలు సంఘటితమై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేర నియంత్రణ, క్రైమ్‌రేట్ తగ్గించడానికి, నిందితులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు పోలీసులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీను, రాజు, దనప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ నవీద్

కృష్ణా: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎస్‌ఐ ఎండీ నవీద్ సూచించారు. సోమవారం మండలంలోని కున్సీ ఉన్నత పాఠశాలకు చెందిన 8, 9 తరగతుల విద్యార్థులు క్షేత్ర సందర్శన కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. సమాజంలో తప్పు చేయనంతవరకూ ఎవరికి భయపడవద్దన్నారు. చదువుపై నిర్లక్ష్యం చేయకుండ శ్రద్ధతో చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కొత్తపల్లి: ఎస్సీల వర్గీకరణ బిల్లు ఆమోదంపై సీఎం రేవంత్‌రెడ్డి, వర్గీకరణ కోసం పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో గ్రామ శివాలయం కూడలిలో పాలాభిషేకం సోమవారం చేశారు. వివిధ గ్రామాలకు చెందిన మాదిగ ఉపకులాల నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గొరగల్ల కృష్ణ మౌర్య, కాంగ్రెస్ నాయకులు తిమ్మారెడ్డి, దాసరి వెంకట్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాదపూజ



దామరగిద్ద: మండల కేంద్రంలో గురువు జగలింగేశ్వర తాతకు పాదపూజ కార్యక్రమం సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన జగలింగేశ్వరుడిని ప్రత్యేక రథంపై మహిళల మంగళ హారతులు, భజనలతో స్థానిక ఆంజనేయ స్వామి స్థానిక ఊరడమ్మ మాత ఆలయం వరకు ఊరేగించారు. వివేకానంద విగ్రహ కూడలిలో భక్తులు వెండి కిరీటం, శాలువా పూలదండలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పాదపూజ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ భక్త బృందం పాల్గొన్నారు.

మహిళలకు తాపీ మేస్త్రీలో శిక్షణ



మహిళా మేస్త్రీకి సేఫ్టీ కిట్లను అందజేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

- కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇందిరమ్మ గృహ నిర్మాణంపై ఎస్‌హెచ్‌జీ మహిళలకు తాపీమేస్త్రీలో శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘాల సభ్యులకు తాపీమేస్త్రీలో శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటిసారిగా వినూత్నంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడానికి డీఆర్‌డీఓ ద్వారా గుర్తించిన మహిళా స్వయం సహాయక సంఘాలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 41 మంది మహిళలకు తాపీమేస్త్రీలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా (నాక్) హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణలో నాక్ ద్వారా రూ.5 లక్షల బడ్జెట్‌లో నాణ్యత గా ఎలా నిర్మించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్స్ అందిస్తారని తెలిపారు. గృహనిర్మాణ శాఖ పీడీ వైద్యం భాస్కర్ మాట్లాడుతూ నియోజకవర్గానికి 3500 ఇళ్లు, మండలంలో సుమారు 700 ఇళ్లు కట్టాల్సి ఉంటుందని, మేస్త్రీలు అవసరమని, అందుకే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ నిధుల నుంచి సీసీకుంట దమగ్నాపూర్ గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యురాలు రాణికి ఇటుక మిషన్ కోసం లక్ష రుపాయాలు అందజేశారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రజిత, సుమతి, ఏఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీలకు విద్యార్థి



అనూషను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ జయప్రద

మక్తల్: రాష్ట్ర స్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు జిల్లా విద్యార్థిని అనూష ఎంపికైందని విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. సోమవారం ఆయనతోపాటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జయప్రద, పీడీ రజిని నర్వ మండంలోని రాయికోడ్ గ్రామానికి చెందిన విద్యార్థి అనూషను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో పుట్టి జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని అన్నారు. విద్యార్థిని అనూష మహబూబ్‌నగర్ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని, అన్ని విధాలుగా సహకరించిన గోపాలంను వారు శాలువాతో సన్మానించారు.

ఈదురు గాలులు.. వడగండ్ల వర్షం



మద్దూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద విరిగి పడిన చెట్టు

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలో సోమవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు తీవ్ర పంటనష్టం వాటిలినట్లు రైతులు పేర్కొన్నారు. నందిపాడ్, జాదరావ్‌పల్లి, మద్దూరు, నిడ్జింత, తదితర గ్రామాల్లో వడగండ్ల వర్షం కురువడంతో వరి పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. మూడు గ్రామాల పరిధిలో దాదాపు 1800 ఎకరాల్లో వరిపంట దెబ్బతినట్లు రైతులు పేర్కొన్నారు.

కోస్గి: మండల పరిధిలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో వడగళ్ల వర్షం కురిసింది. చెన్నారం, బిజ్జారం, మీర్జాపూర్, హన్మాన్‌పల్లి, కడంపల్లితోపాటు పలు గ్రామాల్లో వడగళ్ల వాన జోరుగా కురిసింది. ఈదురు గాలులకు మామిడి పిందెలు నేలరాలినట్లు రైతులు వాపోయారు.



నందిపాడ్‌లోని ఓ పొలంలో పడిన వడగండ్లు

నూతన ఏపీఓ బాధ్యతల స్వీకరణ

సాక్షి ఎఫెక్ట్..



బాధ్యతలు స్వీకరించిన మన్యం

మాగనూర్: ఉపాధి పర్యవేక్షణ ఏది.. మండలంలో ఇన్‌చార్జి ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్ల కొరతతో ఉపాధి పనుల్లో మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సోమవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో కథనానికి స్పందనగా మాగనూర్ మండలానికి నూతన ఏపీఓగా మన్యం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ రహ్మతుద్దీన్ తెలిపారు. నూతన ఏపీఓ మాట్లాడుతూ.. మండలంలో ఉపాధి కూలీలకు సరైన పని కల్పించడంతో పాటు కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

‘ప్రజావాణి’కి 25 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 25 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

అంబలి కేంద్రం ప్రారంభం

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రజల కోసం అంబలి కేంద్రం ఏర్పాటు చేయడంపై ఆ సొసైటీ సభ్యులను కలెక్టర్ అభినందించారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏవో జయసుధ, కె. సుదర్శన్ రెడ్డి, ఆత్మారాం ఏడ్కే, కన్న జగదీష్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై పీఆర్టీయూ నాయకులు సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాద్గిర్ జనార్దన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. అకాల మరణం చెందిన ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం వెంటనే చేపట్టి వారిని ఆదుకోవాలని కోరారు. జిల్లాలో ఖాళీ పోస్టులు లేని చోట సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి ఉద్యోగాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఏర్పడి ఆరేళ్ల గడిచిన జీపీఎఫ్ అకౌంట్ జెడ్పీలో ఆన్‌లైన్ కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



జంగంరెడ్డిపల్లిలో అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ కురుమయ్య

నర్వ: వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పెద్దకడ్మూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని సోమవారం కార్యదర్శి అర్జున్ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామన్‌గౌడ్, శ్రీనివాసులుగౌడ్, కారోబార్ పాష, తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ..

మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో అంబలి కేంద్రాన్ని ఎస్‌ఐ కురుమయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రంతో పాటు, గ్రామానికి చెందిన హోటల్ అంజయ్య సహకారంతో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభం అనంతరం దాత అంజయ్యను ఎస్‌ఐ కురుమయ్య శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విష్ణు, భగవంతు, రాజేశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాములు, వడ్ల బాలస్వామి, సాయిలు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు ఆపాలి



మాగనూర్ పోలీసు స్టేషన్‌లో ఆశా కార్యకర్తలు

మాగనూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా కార్యకర్తల అక్రమ అరెస్టులు ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి. అంజనేయులు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు ఆశాలకు కనీస వేతనం ఆశలకు రూ. 18వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం చలో కోటి కమిషనరేట్ ధర్నాకు వెళ్తున్న ఆశా కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేసి మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు తరలించడం దారుణమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆశాల న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశాలు పాల్గొన్నారు.

ఆశ, వీఆర్ఏల వారసుల అరెస్ట్

మద్దూరు: సమస్యల పరిష్కారం కోసం చలో అసెంబ్లీ చేపట్టినా ఆశా కార్యకర్తలు, వీఆర్ఏల వారసులను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో ఆశా కార్యకర్తలు ప్రమీలా, అనురాధ, వీఆర్ఏ వారసులు రవి, గోవిందు, నర్సిములు, జబ్బుని నర్సిములు, బంటు రమేష్, బసప్ప ఉన్నారు. వీరిని సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



దాతలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాగనూర్: మండల పరిధిలోని అమ్మపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పద్మ(నర్సిములు) రూ.11 వేలు, రామకృష్ణ రూ.5 వేలు, కథలప్ప రూ.5100 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ అద్దె దుకాణాల వేలం

ధన్వాడ: గ్రామ పంచాయతీకి చెందిన దుకాణాలను అద్దెకు ఇచ్చే వేలం పాటను నేడు పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అద్దెకు ఉంటున్న దుకాణాదారులు పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెల అద్దె చెల్లిస్తున్నా కొత్తగా వేలం ఎందుకని ప్రశ్నించారు. జిల్లా అధికారుల ఆదేశానుసారం మాత్రమే వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



విద్యార్థులతో ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు

మద్దూరు: ప్రపంచ కబడ్డీ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్‌కుమార్ పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు సోమవారం పంపిణీ చేశారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శాల హెచ్ఎం సవిత, పీడీ వెంకటప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.